సాక్షి
బాపట్ల
శుక్రవారం : 10 : మార్చి : 2023



అభివృద్ధి పనుల పరిశీలన


రాజుపాలెం: దేవరంపాడు కొండపై వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం పరిశీలించారు.



నృసింహుని అలంకారోత్సవాలు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఆస్థాన అలంకారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ. రామకోటిరెడ్డి తెలిపారు.

ఒక కరోనా కేసు నమోదు



గుంటూరు మెడికల్: జిల్లాలో గురువారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. గుంటూరు నగరంలోని నగరంపాలెం పరిధిలో నమోదు అయింది. కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మాధవరెడ్డికి ఐపీఎస్ హోదా



నగరంపాలెం(గుంటూరు): రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి నాన్‌కేడర్ (ఎన్‌సీ) ఎస్పీ నుంచి ఐపీఎస్ హోదా పొందారు. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. 2021 ఆగస్టు 25న మాధవరెడ్డి గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఆయన 2006లో రేంజ్ అటవీశాఖ అధికారిగా నాలుగేళ్ల పాటు విధులు నిర్వహించారు. 2010లో గ్రూప్-1 ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. నిర్మల్ (మహబూబ్‌నగర్), ఆత్మకూరు (కర్నూలు), మంగళగిరి డీజీపీ కార్యాలయ టెక్నికల్ సర్వీసెస్, పోలీస్ అకాడమీలో ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తించారు. 2018లో ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. కర్నూల్ జిల్లా పరిపాలన, విజయవాడ సిటీ (ట్రాఫిక్) ఏడీసీపీగా, గవర్నర్ ఇన్ రాజ్‌భవన్ ఏడీసీగా విధులు నిర్వహించి, గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చారు.

టెన్త్ ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గురువారం ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రీ-ఫైనల్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేలా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 36,155 మంది విద్యార్థులకు ప్రీ-ఫైనల్ పరీక్షలు మొదలయ్యాయి. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి.

11న తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఆమె గురువారం డీఈవో కార్యాలయంలో మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల ప్రగతి, విద్యా సంవత్సరం పొడవునా నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కులు, అభ్యసన సామర్థ్యంపై తల్లిదండ్రులతో చర్చించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

యార్డుకు 1,25,326 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,25,326 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,19,260 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,740 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నేడు సిమ్స్‌లో జాబ్ మేళా

గుంటూరు మెడికల్: ఫార్మసీ రంగంలో దిగ్గజాలైన రెడ్డీస్ ఫార్మా, అరబిందో, హెట్రో వంటి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలనుకునే వారు శుక్రవారం గుంటూరు మంగళదాస్ నగర్‌లోని సిమ్స్ విద్యా సంస్థల్లో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష గురువారం తెలిపారు. డిగ్రీ, ఫార్మసీ పూర్తయిన విద్యార్థులు, చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు
- ఓటు హక్కును ఓటర్లు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి
- కలెక్టర్ కె. విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్, వేదికపై ఎస్పీ వకుల్‌జిందాల్ తదితరులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ కె. విజయకృష్ణన్ వెల్లడించారు. శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఓటు వేయడానికి వెళ్లే ఓటర్లు తమ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాలని సూచించారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి 22 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. బాపట్ల జిల్లాలోని 13 మండలాలలో 26,390 మంది గ్రాడ్యుయేట్ ఓటర్ల కోసం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి ఎనిమిది మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా బాపట్లలో 1,789 మంది ఓటర్లు ఉన్నారని, వీరికోసం 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల ప్రచారం 12వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ముగుస్తుందన్నారు. 'ఓటు ఎలా వేయాలా' అనే అంశంపై ఓటర్లకు మండలస్థాయి అధికారులు అవగాహన కల్పిస్తున్నారనీ, ఇప్పటికే 90 శాతం ఓటర్లకు స్లిప్పులు అందజేశామన్నారు. ఓటు హక్కు వినియోగించు కోవడానికి ఓటు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు అనుమతి ఉందన్నారు. శాసన మండలి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి 400 మంది ఉద్యోగులను, బందోబస్తు కోసం 666 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలించడానికి మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఆరు స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ నెల 12వ తేదీన ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం ఐదు సెక్టార్లను ఏర్పాటు చేశామన్నారు. సామగ్రి, ఎన్నికల సిబ్బందిని తరలించడానికి నిర్దేశించిన రూట్లలో వాహనాలు వెళ్తాయన్నారు. ఎన్నికల సరళిని నిరంతరం పరిశీలించడానికి పోలింగ్ బూత్‌లలో వెబ్ కాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలను మైక్రో అబ్జర్వర్లు పరిశీలిస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద సి.సి.కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. విధుల్లో ఉండే పోలీసులు ఓటు హక్కు వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తామన్నారు. ఇందుకోసం చీరాల ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వేయడానికి ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల రోజు మద్యం దుకాణాలు మూసివేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. బాపట్ల పరిధిలో రెండు తీవ్ర సమస్యాత్మక, ఏడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు గుర్తించామన్నారు. ఆ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు సులభతరంగా బూత్‌లోకి వెళ్లడానికి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల అవసరాల దృష్ట్యా మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించడానికి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఇద్దరు ఆశ కార్యకర్తలు ఉంటారన్నారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్ నుంచి 200 మీటర్ల పరిధిలో జనసంచారం ఉండరాదన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరపడానికి పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. తీవ్ర సమస్య, సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్ బలగాలను నియమిస్తున్నామన్నారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ నియమించామన్నారు. 13 స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి రౌడీషీటర్లను బైండోవర్ చేస్తామన్నారు. ఇప్పటికే 231 మందిని బైండోవర్ చేశామన్నారు. లైసెన్స్ పొందిన ఆయుధాలను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి. మహేష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: శాసన మండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం కలెక్టర్ చాంబర్లో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి రాజకీయ పార్టీలు వ్యవహరించాలన్నారు. బీఎల్‌వోల ద్వారానే ఓటర్ల స్లిప్పులను ఓటర్లకు అందజేస్తున్నామన్నారు. శాసన మండలి ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ద్వారానే ఓట్లు వేయాల్సి ఉన్నందున ఓటర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. రాజకీయ పార్టీల ఏజెంట్లను ధ్రువీకరించిన తర్వాతే ఎన్నికల బూత్‌లోకి గుర్తింపు కార్డులతో అనుమతిస్తారన్నారు. దీనికోసం ముందస్తుగా ఏజెంట్ల ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారులకు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లు అనుమతించేది లేదన్నారు. బాపట్ల జిల్లాలోని 13 మండలాల్లో శాసన మండలి ఎన్నికలు జరుగుతాయని వివరించారు. 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించామన్నారు. ఓటర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు వేసిన పలు ప్రశ్నలు, సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. చీరాల నియోజకవర్గంలో బోగస్ ఓట్లు తొలగించాలని కోరుతూ సీపీఐ కార్యదర్శి పి.శింగరకొండ, సీపీఎం కార్యదర్శి గంగయ్య జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో డీఆర్‌వో కె.లక్ష్మీశివజ్యోతి, చీరాల ఆర్డీవో పి.సరోజిని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్.శామ్యేల్ మోజస్, టీడీపీ నాయకుడు ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని శ్రీపుష్ప యాగోత్సవం



మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం దేవస్థానం ముఖమండపంపై స్వామి వారి శ్రీపుష్ప యాగోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అష్టదిక్పాలక ఆరాధనతో పాటు ఐదు రకాల పూలతో పుష్పార్చన, మంత్రపుష్పం, తీర్థగోష్టి జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు పూజలు నిర్వహించారు. స్వామివారి శ్రీపుష్ప యాగోత్సవానికి నగరానికి చెందిన కీ.శే.నందం రాములు, పున్నమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు నందం సాంబశివరావు, శాంతికుమారి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

రంగస్థలంపై 'పాకుడురాళ్లు'

- దృశ్యరూపంగా రంగస్థలంపై ఆవిష్కరణ
- నేడు గుంటూరులో ప్రదర్శన
- జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ రచన
- నాటక రూపకర్త నస్రీన్ ఇషాక్



పాకుడురాళ్లు నాటకంలోని సన్నివేశం

తెనాలి: పాకుడురాళ్లు.. ప్రఖ్యాత రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ విశిష్ట రచన. సినిమా పరిశ్రమ కథా వస్తువుగా తెలుగులో వెలువడిన తొలి నవల. సినీ మాయతెరలను బహిర్గతం చేసిన నవలకు 'మాయజలతారు' అనుకున్నా, తర్వాత 'పాకుడురాళ్ల'గా నామకరణం చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఈ నవలపై పరిశోధనలు జరిగాయి. నవల రచయిత రావూరికి 2013లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ అవార్డు లభించింది. ఇప్పుడదే నవల రచయిత సొంత జిల్లా కేంద్రం గుంటూరులో దృశ్యరూపంగా పాకుడురాళ్లు రంగస్థలంపై ఆవిష్కృతం కానుండటం విశేషం.

ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో..

గుంటూరు కళాపరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక 'దర్పణం' ఆవిష్కరణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు ఈ సంచికను ఆవిష్కరిస్తారు. సభానంతరం గుంటూరులోని ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సౌజన్యంతో నిభా థియేటర్ ఎన్సెంబుల్ సమర్పణలో 'పాకుడురాళ్లు' నాటకాన్ని ప్రదర్శిస్తారు. నాటక రూపకర్త నస్రీన్ ఇషాక్.

నస్రీన్ ఇషాక్ మలచిన నాటకం..

ఆరు వందల పేజీల సుదీర్ఘమైన నవలకు రంగస్థల అనువాదం సాహసమే. ఇందులో అనేక పాత్రలు, సంఘటనలు, కుతంత్రాలు, కపట ప్రేమలు, ఆవిరైపోతున్న కలలు.. ఇలా ఎన్నో భావోద్వేగాలు కలగలిపిన నవల ఇది. నటి, దర్శకురాలు, ప్రొఫెషనల్ థియేటర్ మేకర్ నస్రీన్ ఇషాక్, 'పాకుడురాళ్లు' నవలను 10 దృశ్యాలుగా కుదించి 1.45 గంటల నాటకంగా తీసుకొచ్చారు. తొలిగా గత ఏడాది అక్టోబరు 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో ప్రదర్శించారు. మూడో ప్రదర్శన అద్దంకి, నాలుగు, అయిదు ప్రదర్శనలు హైదరాబాద్‌లోనే ఇచ్చాక ఆరోసారి విశాఖలో ప్రదర్శించారు. ఇప్పుడు ఏడో ప్రదర్శనతో గుంటూరు నాటక, సాహిత్యాభిమానులను అలరించనున్నారు.

ఇప్పటికే ప్రశంసలు..



నవలలోని ప్రధాన పాత్రలను ఎంచుకుని, ఒక వరసలో సమకూర్చుకుని విభిన్నమైన ప్రదేశాలను ఏకకాలంలో ప్రేక్షకులకు చూపిస్తూ తన్మయత్వానికి గురిచేస్తారు ప్రదర్శకులు అన్న ప్రశంసలను అందుకుందీ నాటకం. దర్శకురాలిగా నస్రీన్ ఇషాక్ పాత్రలకు తగిన నటీనటుల ఎంపికను చేసుకున్నారు. హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన తమిళమ్మాయి భావన వాసపందల్ మంజరిగా అచ్చు తెలుగమ్మాయిగా నటించారు. నటీనటుల శారీరక కదలికలు, ముఖంలో పలికించే భావోద్వేగాలు, ఆహార్యం ప్రేక్షకుడు ఆ పాత్రను గుర్తుపట్టేలా ఉంటాయి. ప్రతి దృశ్యంలోనూ రంగస్థలంపై లైటింగ్ సజీవతను తీసుకొస్తుంది. నాటక దృశ్యంలోని లాలిత్యాన్ని తెలియజేస్తూ సంగీతం మనసును రంజింపజేస్తుంది. నాటకంలో డిజైనింగ్, అంతకుమించి పాత్రలు ధరించే కాస్ట్యూమ్స్ ప్రత్యేకంగా ఉన్నాయన్న అభినందనలూ వచ్చాయి.

రగడల రహస్యమిదేనా!

- సత్తెనపల్లి, గుంటూరులో వర్గాల మధ్య పోరుకు ఆజ్యం
- ముందస్తు వ్యూహంతోనే గ్రూపుల కొనసాగింపా?
- పొరుగు నేతల బెర్త్ రిజర్వుకేనా ఎత్తుగడలు
- యువ నాయకులు, సీనియర్లలో అంతర్మథనం
- చంద్రబాబు తీరుపై ముఖ్యుల మండిపాటు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడైన మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 2019 సెప్టెంబరు 16న ఆత్మహత్య చేసుకున్నారు. సత్తెనపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆయన మరణం తరువాత అక్కడ టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా తయారైంది.

గుంటూరు పశ్చిమం నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన మద్దాళి గిరిధరరావు టీడీపీకి దూరమయ్యారు. అప్పటి నుంచి అక్కడా సరైన నాయకత్వం లేదు. కోవెలమూడి రవీంద్రకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ గ్రూపులను పెంచి పోషించడానికే టీడీపీ అధినాయకత్వం ప్రాధాన్యతనిస్తోందనేది నిష్టూరసత్యం.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి




నియోజకవర్గాలలో టీడీపీ నాయకుల మధ్య గ్రూపులు, గొడవలు వాటంతట అవే ఏర్పడి కొనసాగుతున్నాయా? లేక అధిష్టానమే గ్రూపులు ఏర్పడేందుకు దోహదపడి ఆపై వాటికి ఆజ్యం పోస్తోందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు పార్టీలోని ముఖ్య నాయకులు, సీనియర్ క్యాడర్ నుంచి వస్తున్నాయి. రాజకీయ పొత్తులు కుదురుతాయని, ఏదో ఒక పార్టీ నుంచి ఎవరో ఒకరు తరలివచ్చేస్తారని, బడా పారిశ్రామికవేత్తలో, ఎన్ఆర్ఐలో చేరిపోతారనే ముందస్తు అంచనాలు ఉన్నందునే గొడవలు రాజేయించడం, వాటిని కొనసాగింపజేయడం తమ అధినేతకు అలవాటేనని గత అనుభవాలను ఉదహరిస్తున్నారు. రాబోయే వారికి సీటు రిజర్వు చేయడం కోసం కొన్ని నియోజకవర్గాల్లో బహు నాయకత్వాన్ని పెంచిపోషించడం ముందు నుంచి ఉన్నదేనని విశ్లేషిస్తున్నారు.

సత్తెనపల్లిలో ముగ్గురి మధ్య..

డాక్టర్ కోడెల దివంగతులై మూడున్నరేళ్లు అయ్యింది. ఆయన కుమారుడు డాక్టర్ కోడెల శివరామకృష్ణ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్నారు. ఆయన తండ్రి స్పీకర్‌గా వ్యవహరించినప్పుడు నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. జిల్లాలోనే సీనియర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన డాక్టర్ కోడెల కుమారునికి, కానిపక్షంలో ఆయన కుటుంబీకుల్లో ఆసక్తి ఉన్న వారికి బాధ్యతలను అప్పగించవచ్చు. అలా చేయలేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు సైతం ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (అబ్బూరి మల్లి) కూడా కార్యక్రమాలను నిర్వహిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలకు తానూ పోటీలో ఉన్నట్లు వల్లె వేస్తున్నారు. తమవైపు ఏదోరోజు అధిష్టానం చూడకపోతుందా? అన్న ఆశతో ఈ ముగ్గురు క్యాంటీన్లను తమదైన రీతిలో నెట్టుకొస్తున్నారు. చంద్రబాబు ఆశీస్సులు తనకంటే తనకేనని ఇద్దరు అంటుంటే.. కాదు లోకేష్ ప్రోత్సాహం తనకేనంటూ మరొకరు ఎవరి స్థాయిలో వారు నియోజకవర్గ నాయకులు, శ్రేణుల వద్ద చెప్పుకుంటున్నది బహిరంగ రహస్యమే. ఓ వైపు గ్రూపుల మధ్య రచ్చను రాజేస్తూనే మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు నేతృత్వంలో పరిశీలక కమిటీని నియమించడం తమ అధినేతకే చెల్లిందని వ్యాఖ్యానిస్తున్నారు. కమిటీ ఎదుటే వర్గాలుగా విడిపోయి గొడవ పడటం, సమావేశం రసాభాసగా మారడం పార్టీ నాయకులు, శ్రేణులకు తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమక్షంలో జరిగిన సమావేశమే నామ్‌కే వాస్తేగా మిగలడం, ఇదంతా అధినేత డైరెక్షన్‌లో నడిచిందనే వ్యాఖ్యలు అప్పట్లోనే వినిపించాయి. ఎవరి రాక కోసమో ఎదురు చూస్తూ, వారికి సీటు రిజర్వు చేసే ఉద్దేశంతో ఇలా తమ మధ్య తగవులను ప్రోత్సహించడం, పార్టీ నాయకులు, క్యాడర్‌లో పలుచన చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ముఖ్యుల నుంచి వస్తోంది.



గుంటూరు వెస్ట్‌లోనూ..



సత్తెనపల్లిలోనే కాదు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనూ ఇవే తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయని పార్టీ ముఖ్యులు గుర్తుచేస్తున్నారు. రాజకీయ పొత్తుల్లో భాగంగా కాని, కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి సర్దుబాటు చేయడానికో ఈ స్థానాన్ని కూడా అధిష్టానం ఎటూకాకుండా చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి వ్యతిరేకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తున్న వైనం, చంద్రబాబు తీరు నచ్చక టీడీపీ నుంచి గెలుపొందిన మద్దాళి గిరిధరరావు కొంతకాలానికే ఆ పార్టీకి దూరమయ్యారు. అప్పటి నుంచి నియోజకవర్గ బాధ్యతలను కోవెలమూడి రవీంద్రకు అప్పగించినప్పటికీ వర్గాలను మాత్రం ప్రోత్సహిస్తోందని పార్టీ నాయకులే గుర్తుచేస్తున్నారు. స్వయంగా చంద్రబాబే స్వచ్ఛంద కార్యక్రమాల ముసుగులో ఉయ్యూరు శ్రీనివాస్ అనే ప్రవాసాంధ్రునితో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారని అంటున్నారు. అందులో తొక్కిసలాట జరిగి ముగ్గురు పేద మహిళలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సీనియర్లు కూడా అంటీముట్టనట్లు ఉండాల్సి వచ్చింది. మరోవైపు డాక్టర్ నిమ్మల శేషయ్యను ప్రోత్సహిస్తున్నారని పార్టీ నగర నాయకులు గుర్తుచేస్తున్నారు. భాష్యం విద్యా సంస్థలకు చెందిన ప్రవీణ్‌ను కూడా ప్రోత్సహిస్తోందని పార్టీ నాయకులు చెబుతున్నారు. హోర్డింగ్‌లతో నగరంలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా గుంటూరుకు మాత్రమే నగర పార్టీ కమిటీ ఉంది. డేగల ప్రభాకర్‌ను నగర అధ్యక్షుడిగా చేయడం, ఆయననూ ఓ ఆశావహునిగా కొనసాగింపజేయడం అధిష్టానానికే సాధ్యమవుతోందంటున్నారు. కోవెలమూడి రవీంద్ర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నా పశ్చిమంలోని సీనియర్లయిన యాగంటి దుర్గారావు, కొమ్మినేని ప్రసాద్, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుల సహకారం లేదనేది శ్రేణులందరికీ స్పష్టంగా తెలుసు. చివరకు నగరపాలక సంస్థలో పార్టీ సహచర కార్పొరేటర్ల నుంచి కూడా ఏమాత్రం సహకారం లేదని కోవెలమూడి ఆవేదన వ్యక్తం చేయడం రివాజే. ఇక్కడ కూడా సత్తెనపల్లి తరహా ఎత్తుగడే. చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు ఆశీస్సులు నాయకులకు వేర్వేరుగా ఉంటున్నందున ఎవరి స్థాయిలో వారు గ్రూపు రాజకీయాలను కొనసాగిస్తున్నారు. నాయకుల మధ్య విభజించు పాలించు అనే సూత్రాన్ని అధినేతే అమలుపరుస్తున్నప్పుడు భవిష్యత్తులో తమ నియోజకవర్గాలకూ వ్యాపించదనే గ్యారంటీ ఏమిటనే అనుమానాలు సీనియర్లలోనూ తలెత్తుతున్నాయని జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. 'ఈ దఫా సీటు ఉండకపోవచ్చనే పుకార్లు పైస్థాయిలో నుంచే మొదలవుతాయి. చివరి క్యాడర్ వరకు అవి వ్యాపిస్తాయి. మీ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు ఉన్నాయంటూ మొదటికే మోసగించేలా ప్లాన్ చేసి అమలుచేయడం అలవాటే' అంటూ అధినేత తీరును దుయ్యబడుతున్నారు. 'నియోజకవర్గంలో ఏదైనా సమస్య ఉందనిపిస్తే తక్షణం సరిచేయాలి. లేదా సర్దుబాటు అయినా చేసేయాలి. ఇతర పార్టీలు ఎలా చేస్తున్నాయో చూసైనా తెలుసుకోవాలి. నలభై ఏళ్ల అనుభవమని చెప్పుకోవడానికే సరిపోతోంది' అని నగరానికి చెందిన సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ పథకాలకు తోడ్పాటు అందించాలి

డీఆర్డీఏ పీడీ అర్జున్‌రావు

జే.పంగులూరు: వీవోఏలు అంటే బ్యాంకు రుణాలు ఇప్పించడం వరకే కాదు, ప్రభుత్వం నిర్వహించే అన్ని పథకాలకు తోడ్పాటు అందించాలని డీఆర్డీఏ పీడీ అర్జున్‌రావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు, హౌసింగ్ పీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల వీవోఏలకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు జగనన్న కాలనీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ పీడీ ప్రసాద్ మాట్లాడుతూ మార్చి 21 నాటికి బాపట్ల జిల్లాలో 10744 ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగేవిధంగా చేయాలన్నారు. దీనికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు మాట్లాడుతూ 271 ఇళ్ల నిర్మాణం ఇంతవరకు జరగలేదని, వాటిలో ఇప్పటికి 51 ఇళ్లకు మాత్రమే వెలుగు వీవోఏలు రుణాలు ఇప్పించారని చెప్పారు. ఇంకా 219 మందికి రుణాలు అందించాలని తెలిపారు. సోమవారం నాటికి కనీసం 100 మందికైనా బ్యాంకుల నుంచి రూ.35 వేలు రుణం ఇప్పించి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు అందించాలన్నారు. తహసీల్దార్ ఐ పద్మావతి, ఎంపీడీవో రమణమూర్తి, ఏసీ రవికుమార్, ఏపీఎం జ్యోతి ప్రసాద్, హౌసింగ్ ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి

విశాఖపట్నం స్త్రైల్ శిక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.రమణయ్య



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య

కర్లపాలెం: ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా అమలుచేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ విశాఖపట్నం స్త్రైల్ శిక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.రమణయ్య అన్నారు. మండల పరిధిలోని ఏట్రవారిపాలెం గ్రామ సచివాలయం వద్ద పశు వైద్యాధికారి డాక్టర్ రేచల్ దివ్య ఆధ్వర్యంలో గురువారం పశు విజ్ఞానబడి సదస్సు నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ పశువుల కోసం 60శాతం సబ్సిడీలో పశువుల దాణా అందజేస్తున్నామని తెలిపారు. 75శాతం సబ్సిడీలో పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్నామని పశు పోషకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా పశు వైద్యాధికారి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం పశుపోషణ కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా అనేక సబ్సిడీ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. పశుగ్రాసం కట్ చేసే చాఫ్‌కటర్ ఖరీదు రూ.30వేలు కాగా సబ్సిడీలో రైతులకు రూ.20వేలకు అందజేస్తున్నామని తెలిపారు. పశువులకు వేసే ఎండు గడ్డిలో ఎలాంటి పోషక విలువలు లేవని 100కేజీల ఎండుగడ్డికి 4కేజీల యూరియా ద్రావణం చల్లి వారంరోజుల పాటు నీడలో నిలువ చేసుకుని పశువులకు పెట్టటం వలన పోషకాలు లభిస్తాయని తెలిపారు. పోషక విలువలు ఉన్న పశుగ్రాసం పెట్టటం వలన పాలదిగుబడి పెదరుగుతుందని తెలిపారు. సర్పంచి చీరాల వెంకటలక్ష్మి, కార్యదర్శి డి.పద్మావతి, పశు సంవర్ధకశాఖ ఏడీ శంకరరావు, పశు వైద్యులు రేచల్ దివ్య, ఏహెచ్ఏ రహ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి నాటిక పోటీలు


మాట్లాడుతున్న బాలభక్త బృంద కమిటీ సభ్యుడు గడ్డం సత్యనారాయణ

రేపల్లె: పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంక్ బజారులో ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు బాలభక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించే 57వ శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులకు యార్లగడ్డ సుబ్బారావు కళాపరిషత్ వారిచే సాంఘిక నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలభక్త బృంద కమిటీ సభ్యుడు గడ్డం సత్యనారాయణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న కళాకారుల ప్రదర్శనలను పరిశీలించి వాటిలో ఎంపిక చేసిన నాటికలకు 30వ తేదీ నుంచి 2వ తేదీ వరకు రోజుకు మూడు నాటికలు చొప్పున ప్రదర్శిస్తారని తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన నాటిక పోటీలకు బహుమతులు అందజేయబడునన్నారు. ఆసక్తి కలిగిన కళాకారులు పూర్తి వివరాలకై 9490643821 నంబరును సంప్రదించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు యార్లగడ్డ రాంబాబు, రామకృష్ణ, సాంబశివరావు, ల్యాబ్ సాయి, కొండవీటి అగస్త్యశాస్త్రి, కృష్ణా మాస్టార్, మేకా కోటేశ్వరరావు, బ్యాంక్ శ్రీమన్నారాయణ, గురుప్రసాద్, రత్తయ్య, బోయిపాటి సాంబశివరావు, సురేష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి మార్టూరులో రాష్ట్రస్థాయి నాటిక పోటీలు


నాటికల పోటీల వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

మార్టూరు: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 13వ నాటిక పోటీలు ఈనెల 14,15,16 తేదీల్లో మార్టూరులో నిర్వహించనున్నట్లు ప్రముఖ నాటక రచయిత విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. స్థానిక శ్రీకారం కళాపరిషత్, మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాటికల పోటీలకు సామాజిక స్పృహ కలిగించే 10 నాటికలు ఎంపిక చేసినట్లు చెప్పారు. మొదటి రోజు 14వ తేదీ రాత్రి 8.30 గంటలకు శార్వాణి ఫైన్ ఆర్ట్స్ బోరివంక వారి 'కొత్త పరిమళం', 10.30 గంటలకు సాయిఆర్ట్స్ కొలకలూరి వారి 'ప్రేమతో నాన్న', 11 గంటలకు గంగోత్రి పెదకాకాని వారి 'పేగు రాసిన శాసనం', రాత్రి 12 గంటలకు జనచైతన్య ఒంగోలు వారి 'చేతి రాత' నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రెండో రోజు రాత్రి 8.30 గంటలకు అద్దేపల్లి, ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి 'శవరంజని', రాత్రి 10.30 గంటలకు కళావర్షిణి వీరన్నపాలెం వారి 'రాజరాజచోరులు', 11.30 గంటలకు సద్గురు కళానిలయం గుంటూరు వారిచే 'కమనీయం' నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. చివరి రోజు రాత్రి 8.30 గంటలకు అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'వెండి అంచులు', రాత్రి 10.30 గంటలకు పండు క్రియేషన్స్ కొప్పోలు వారి 'పక్కింటి మొగుడు', రాత్రి 11.30 గంటలకు ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'ప్రక్షాళన' నాటికలు ప్రదర్శిస్తారని, రాత్రి 12. 30 గంటలకు 'శ్రీకారం', రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో 'డబ్బుకు లోకం దాసోహం కారాదు గణనాథ' నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, 3150 రోటరీ జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి జీ బలరామయ్య, డాక్టర్ జీ సమరం, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సన్స్ డైరెక్టర్ కేఎస్ గోపాల్ హాజరవుతారని తెలిపారు. మార్టూరు పరిసర గ్రామాల ప్రజలు నాటికలను వీక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాంబశివరావు కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు కొర్రపాటి ఖాజారావు, కుర్రా వెంకటరామయ్య, ఇంటూరి ఆంజనేయులు, రావి అంకమ్మచౌదరి, కందిమళ్ల నాగేశ్వరరావు, చెన్నుపాటి బసవరాములు, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన

గుంటూరు ఎడ్యుకేషన్: సీడాప్, మార్గ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిట్టర్ ఎలక్ట్రికల్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు మార్గ్ శిక్షణా కేంద్రం హెడ్ అంబటి గోపీచంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హతలతో 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు గల పురుష అభ్యర్థులకు గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని ఎస్‌బీఐపై అంతస్తులో ఉన్న మార్గ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడు నెలలపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణానంతరం నూరుశాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 91334449 85, (86), (88), (89), నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమోసా అమ్ముతుండగానే ఆగిన శ్వాస


శివ మృతదేహం

చీరాల: రోజూ మాదిరిగానే పట్టణంలో తిరుగుతూ సమోసాలు అమ్ముకుని జీవనం సాగించే వ్యక్తి హఠాత్తుగా కుప్పకూలి మృతి చెందాడు. ఈఘటన మండలంలోని జాండ్రపేటలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని జాండ్రపేటకు చెందిన పాదర్తి శివచంద్రరావు (60) సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారిగా సమోసాలు అమ్ముకోవడానికి బయలుదేరాడు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆకృతి షాపింగ్ వద్దకు రాగానే గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలాడు. 108 సిబ్బంది వచ్చి సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, కూమార్తె, కుమారుడు ఉన్నారు.

మహిళా కానిస్టేబుల్‌పై దాడి


ముగ్గురిపై కేసు నమోదు


మహిళా కానిస్టేబుల్ కుడి కంటిపై గాయమైన దృశ్యం

వేటపాలెం: పెళ్లి వేడుకల్లో యువకులు ఘర్షణ పడుతున్న సమయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్‌పై మహిళలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని కుందేరులో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. కుందేరు ప్రాంతంలో వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో కొందరు యువకులు మద్యం తాగి ఘర్షణ పడి దాడి చేసుకున్నారు. కొంతమంది పోలీసుస్టేషన్‌కి ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఎస్సై ముగ్గురు కానిస్టేబుళ్లను ఘటనా స్థలానికి పంపించారు. ఆ ప్రాంతానికి చేరుకుని ఘర్షణ పడుతున్న వారిని కానిస్టేబుళ్లు అదుపు చేస్తున్నారు. ఈ సన్నివేశాన్ని మరో మహిళా కానిస్టేబుల్ సునీత తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తోంది. అక్కడే ఉన్న మరి కొందరు మహిళలు వీడియో తీస్తున్న కానిస్టేబుల్‌పై దాడి చేశారు. దాడిలో సునీత కంటికి గాయమైంది. చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. విధులు నిర్వహిస్తున్న తనపై ఇద్దరు మహిళలు దాడి చేసినట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి గురైన 13 బైకులు స్వాధీనం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు


స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఫిరోజ్

మార్టూరు: విలాసాలకు, వ్యసనాలకు అలవాటుపడిన నలుగురు యువకులు డబ్బుకోసం వాహనాల చోరీకి ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయిన ఘటన గురువారం మార్టూరులో వెలుగు చూసింది. బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట బాలాజీ కాలనీకి చెందిన దంతాల ప్రవీణ్‌కుమార్, పోతురాజు వీరబాబు, జాలయ్య కాలనీలో కారు డ్రైవర్‌గా పనిచేసే మాచర్ల ఏసు, చిలకలూరిపేట మున్సిపల్ పేట స్వీపర్ స్వర్ణ విజయ్‌లు నలుగురు మద్యం షాపుల వద్ద ఒకరికొకరు పరిచయం అయ్యారు. వ్యసనాలకు బాగా అలవాటు పడిన వారు డబ్బు కోసం ద్విచక్రవాహనాలు చోరీ చేసి విక్రయించాలని భావించి మార్టూరు, అద్దంకి, నరసరావు పేట, గుంటూరు, సత్తెనపల్లి, చీరాల తదితర ప్రాంతాల్లో నిలిపి ఉంచిన 13 బైకులను చోరీ చేశారు. వాటిని మార్టూరు సమీపంలోని ఒక పైపుల ఫ్యాక్టరీ వద్ద గల పాడుబడిన గోదాములో దాచి ఉంచారు. గురువారం సాయంత్రం స్థానిక రాజుపాలెం రెస్ట్ ఏరియా ప్రాంతంలో తనిఖీ నిర్వహిస్తున్న సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఎస్సై కమలాకర్‌లు అనుమానస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా బైకులు చోరీ విషయం వెలుగు చూసింది. వారి వద్ద నుంచి వాహనాలను స్వాదీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. చాలా కాలంగా ప్రశ్నార్థకంగా మారిన బైకు దొంగలను అరెస్ట్ చేయడంలో చొరవ చూపిన సీఐ ఫిరోజ్, ఎస్సై కమలాకర్‌లతో పాటు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, ప్రసాద్‌లను నగదు రివార్డులు, ప్రశంస పత్రాల కోసం బాపట్ల ఎస్పీకి సిఫారసు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.